యాదాద్రి భువనగిరి



తల్లీ.. నీకు వందనం
తల్లిగా, భార్యగా, ఉద్యోగులుగా బాధ్యతలు, విధులు నిర్వహిస్తే ఆదర్శంగా నిలుస్తు న్నారు.. ఎంతో మంది మహిళలు - 10లో



అధ్వానంగా గ్రామీణ రోడ్లు
మోత్కూరు మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు రాకపోకలకు వీల్లేకుండా తయారయ్యాయి. - 11లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 39°/25°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంటుంది.

31లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

రామగిరి(నల్లగొండ) : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ రెండవ, నాలుగు, ఆరవ సెమిస్టర్ విద్యార్థులు మే 31వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని నల్లగొండలోని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులంతా సకాలంలో ఫీజు చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు www. bsoau.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. పరీక్షల షెడ్యూల్ ఆరో సెమిస్టర్ జూన్ 20 నుంచి 25 వరకు నాలుగో సెమిస్టర్ జూన్ 26 నుంచి జూలై 2 వరకు రెండవ సెమిస్టర్ జూలై 4 నుంచి 10వ తేదీ వరకు ఉంటాయి.


భువనగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, స్థానికులు

భారత జవాన్లకు సంఘీభావం



భువనగిరిటౌన్ : ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా జిల్లా కేంద్రంలో భువనగిరి పట్టణ పోలీసులు ర్యాలీ నిర్వహించారు. త్రివర్ణ పతాకంతో హైదరాబాద్ చౌరస్తా నుంచి వినాయక చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. ఇండియా, పాక్ దేశాల మధ్య యుద్ధం జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రతి పౌరుడు భారత జవాన్లకు అండగా నిలవాలని, రోడ్లపైకి వచ్చి జాతీయ సమైక్యతను చాటాలని సీఐ రమేష్ కోరారు. ర్యాలీలో ఎస్ఐలు, కుమారస్వామి, లక్ష్మీనారాయణ, జయరాజు, పోలీసు సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అమ్మా.. సెల్యూట్!

ఆ తల్లి తన బిడ్డకు ఉగ్గుపాలతోనే దేశభక్తిని నేర్పించింది. గొప్ప యోధుడిగా తీర్చిదిద్ది.. భరతమాతకు అంకితం చేసింది. ఆ బిడ్డ దేశ రక్షణలో వీరమరణం పొందాడు. గర్భశోకం మిగిల్చినా.. తన బిడ్డ దేశం కోసం ప్రాణత్యాగం చేశాడని గర్వపడుతోంది సూర్యాపేటకు చెందిన కల్నల్ సంతోష్‌బాబు తల్లి మంజుల. ఆదివారం మదర్స్‌డే సందర్భంగా 'సాక్షి' ఆమెను పలకరించగా.. ఆనాటి జ్ఞాపకాలు.. ప్రస్తుత పరిస్థితులపై పలు విషయాలను పంచుకున్నారు.
- సూర్యాపేట అర్బన్

- నా బిడ్డ దేశం కోసం ప్రాణాలిచ్చాడు
- అందుకు నేను ఎంతో గర్వపడుతున్నా
- దేశసేవ కంటే కడుపుకోత పెద్ద బాధేమీ కాదు
- ఇప్పుడు కూడా మా బాబు యుద్ధం చేస్తున్నట్టే అనిపిస్తోంది
- దేశ రక్షణకు యువత సైన్యంలో చేరాలి

మదర్స్ డే సందర్భంగా 'సాక్షి'తో కల్నల్ సంతోష్‌బాబు తల్లి మంజుల


కల్నల్ సంతోష్‌బాబు చిత్రపటంతో తల్లి మంజుల

సంతోష్ బాబు ఫిబ్రవరి 13, 1983లో జన్మించాడు. మా బాబు.. నేనే ప్రపంచంలా ఉండేవాడు. పాఠశాల కంటే ముందు నేనే ఇంటి వద్ద అక్షరాలు నేర్పించాను. మేము ఉద్యోగరిత్యా ఆదిలాబాద్ జిల్లా లక్సెట్టిపేటలో ఉన్నప్పుడు సంతోష్‌కు చదివించడం, రాయించడం, క్రమశిక్షణ నేర్పించాను. నేను దేశభక్తి గేయాలు పాడుతుంటే తను కూడా పాడేవాడు.చిన్నప్పటినుంచే సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తిని నూరిపోశాను. లక్సెట్టిపేటలో చదువు ముగుస్తుండగానే కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చేర్పించాం. ఆ పాఠశాల నిర్వహించిన ఎంట్రెన్స్ టెస్ట్‌లో రాష్ట్రంలోనే మూడో ర్యాంకు సాధించాడు. తర్వాత నేషనల్ డిఫెన్స్ అకాడమీలో 126వ ర్యాంకు సాధించాడు. డెహ్రాడూన్‌లో ఆర్మీ అధికారులతో మాకు విందు చేసే అవకాశం మా బాబు వల్లే లభించింది.

సంతోష్‌బాబు ఎంతో జాలి కలవాడు

సంతోష్‌బాబు 2016లో లెఫ్టినెంట్ కల్నల్‌గా, 2017లో కల్నల్‌గా పదోన్నతి పొందాడు. ఎక్కడ ఉన్నా రోజూ నాతో తప్పనిసరిగా మాట్లాడేవాడు. కొడుకుగా ఎంతటి పెద్దస్థానంలో ఉన్నా ఎప్పుడూ నాకు ఏదైనా పని చెప్తావా, నేనేమైనా సహాయం చేయాలా అమ్మ అని అడిగేవాడు. జాలి, దయ కలవాడు. 2020 జూన్ 14వ తేదీన మాకు మధ్యాహ్నం రెండు గంటలకు పిడుగులాంటి వార్త తెలిసింది. సంతోష్ ఇక లేడు అనే వార్తను టీవీలో చూస్తుండగానే వందల మంది మా ఇంటికి వచ్చారు. దేశం కోసం నా కొడుకు ప్రాణం అంకితం అయిందని గర్వపడ్డ క్షణాలు ఇంకా నా కళ్ల ముందు మెదలాడుతూనే ఉన్నాయి.

కడుపుకోత కన్నా దేశ సేవ ముఖ్యం

దేశ సేవను మించిన సేవ ఏదీ లేదు. దేశసేవ కంటే కడుపుకోత పెద్ద బాధేమీ కాదు. దేశం కోసం ప్రాణాలర్పించిన నా కొడుకు ప్రతి ఒక్క భారతీయుడి గుండెల్లో జీవించే ఉంటాడని గర్వంగా చెబుతాను(భావోద్వేగానికి లోనవుతూ). సంతోష్ బాబు ప్రేరణతో భారతదేశంలో ఉన్న తల్లులు తమ పిల్లలను సైన్యంలోకి పంపించి భరతమాత రుణాన్ని తీర్చుకోవాలి.

యువత దేశ రక్షణకు పూనుకోవాలి
ప్రస్తుతం యువత సెల్‌ఫోన్‌లోనే మునిగి తేలుతోంది. డ్రగ్స్ గంజాయి బారిన పడుతోంది. అలా చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఆర్మీలో చేరి దేశసేవ చేయాలి, దేశరక్షణకు పూనుకోవాలి.

పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాలి
పాకిస్తాన్ ఉగ్రవాదులు మన దేశంలో చొరబడి అమాయక ప్రజల ప్రాణాలు తీస్తున్నారు. వారికి మన సైన్యం తగిన రీతిలో సమాధానం ఇస్తోంది. రోజూ టీవీలో చూస్తుంటే నా కొడుకు యుద్ధం చేసినట్టే ఉంది. సంతోష్ బాబు ఉంటే పాకిస్తాన్‌తో యుద్ధంలో చురుగ్గా పాల్గొనేవాడు.


సంతోష్‌బాబుతో తల్లి మంజుల (ఫైల్)

దేశ ప్రజల గుండెల్లో జీవించే ఉంటాడు

సంతోష్ బాబు దేశం కోసం ప్రాణాలర్పించడం దేశంలో ఉన్న ప్రతి యువకుడిని కదిలించింది. ఎంతో మందికి స్ఫూర్తిదాయకం అయ్యింది. ఇంత గొప్ప దేశ భక్తునికి జన్మనివ్వడం నిజంగా నా పూర్వ జన్మ సుకృతం. సంతోష్ బాబు మరణించినా.. దేశ ప్రజల గుండెల్లో ఎప్పుడూ జీవించే ఉంటాడు.

ఇద్దరు కుమారులను సైన్యంలోకి పంపి.. 10లో

లైసెన్స్‌డ్ సర్వేయర్లు

అర్హత కలిగిన ప్రైవేట్ సర్వేయర్లకు లైసెన్స్‌లు
- మ్యాథ్స్‌తో ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చేసినవారికి అవకాశం
- భూ భారతి చట్టం అమలులో భాగంగా వారికి ప్రత్యేక శిక్షణ
- ఉమ్మడి జిల్లాలో దాదాపు 500 మందికి అవకాశం
- భూ సర్వేకు తొలగనున్న అడ్డంకులు



సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తెచ్చి న భూభారతి చట్టం అమలుకు అర్హులైన సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారికి ప్రత్యే క శిక్షణ ఇచ్చి, లైసెన్స్‌లు జారీ చేస్తుంది. కాబట్టి జిల్లాలో ఉన్న అర్హులైన వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెల 17లోగా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి.
- నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : భూ సమస్యల పరిష్కారానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లు రాబోతున్నారు. ఇప్పటి వరకు ఉన్న వారిలో అర్హత కలిగిన ప్రైవేట్ సర్వేయర్లతోపాటు కొత్త వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి వారికి లైసెన్స్‌లు జారీ చేయనున్నారు. ప్రభుత్వం నూతనంగా తెచ్చిన భూ భారతి అమలులో వారి సేవలను వినియోగించుకుని భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని దాదాపు 500 మందికి సర్వేయర్లుగా త్వరలోనే ప్రత్యేక శిక్షణ ప్రారంభించబోతోంది.

26 నుంచి శిక్షణ
భూభారతి అమలులో భాగంగా రాష్ట్రంలో ఐదు వేల మందికి సర్వేయర్లుగా శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లోనూ శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. అర్హులైన వారు ఈ నెల 17వ తేదీలోగా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్లు సూచించారు. 60 శాతం మార్కులతో, గణితం సబ్జెక్టుగా కలిగిన ఇంటర్ పూర్తయినవారు, ఐటీఐ (డ్రాఫ్ట్‌మెన్ సివిల్), డిప్లొమా, బీటెక్ సివిల్, తత్సమాన అర్హతలు కలిగిన పాత సర్వేయర్లతోపాటు, కొత్త అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అలా దరఖాస్తు చేసుకున్న వారికి మే 26వ తేదీ నుంచి జూలై 26వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. రెవెన్యూ పరిపాలనకు తోడుగా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు శాఖ ద్వారా ఈ సర్వేయర్లకు శిక్షణ ఇవ్వబోతున్నారు. ఇందులో నల్లగొండ జిల్లాలోనే 200 మంది, సూర్యాపేట జిల్లాలో 150 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో మరో 150 మందికి శిక్షణ ఇచ్చే అవకాశం ఉంది.

మూడు దశల్లో శిక్షణ, పరీక్షలు
సర్వేయర్లకు మూడు దశల్లో శిక్షణ ఇస్తారు. థియరీ, టిప్పన్ ప్లాటింగ్, క్షేత్ర స్థాయి (ఫీల్డ్) విషయాల్లో శిక్షణ ఉంటుంది. ఆ తరువాత 40 రోజుల పాటు మండల సర్వేయర్ కింద ప్రత్యేక శిక్షణ ఇస్తారు. తర్వాత జిల్లా స్థాయిలో వేర్వేరుగా పరీక్ష నిర్వహిస్తారు. అందులో పాసైన వారికి ఫైనల్ అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహిస్తారు. అది పాసైతే లైసెన్స్ కోసం వారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన వారు సర్వే చేసేందుకు అర్హులు. వారు చేసే సర్వేకు అధికారిక గుర్తింపు ఉంటుంది. భూ భారతి చట్టం అమలులోనూ సర్వే పనుల కోసం వారి సేవలను పరిగణనలోకి తీసుకోనున్నారు.

తీరనున్న సర్వేయర్ల కొరత
జిల్లాలో ఇక సర్వేయర్ల కొరత తీరనుంది. ప్రస్తుతం నల్లగొండ జిల్లాలో 33 మండలాల పరిధిలో 17 మంది ప్రభుత్వ సర్వేయర్లు, ముగ్గురు డిప్యూటీ సర్వేయర్లు, ఆరుగురు కమ్యూనిటీ సర్వేయర్లు మొత్తం 26 మంది మాత్రమే ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో 23 మండలాలు ఉండగా, 15 మంది మాత్రమే సర్వేయర్లు ఉన్నారు. యాదాద్రి జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది. ప్రభుత్వం వివిధ పథకాల కింద భూసేకరణ చేపట్టే పనులకు వారే సర్వే చేయాల్సి రావడంతో తీవ్ర జాప్యం అయ్యేంది. సర్వే కోసం దరఖాస్తు చేసుకుంటే నెలల సమయం పట్టేది. మరోవైపు గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి కారణంగా అనేక రకాల భూ సమస్యలు తలెత్తాయి. ఒకరి భూమి మరొకరికి పేరున పడటం, హద్దులు చెరిగిపోయాయి. దీంతో చాలా మంది సర్వేకు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే వ్యవసాయ భూములు కూడా రియల్ ఎస్టేట్‌గా మారిపోతున్నాయి. ఈ క్రమంలో నాలా కన్వర్షన్ కోసం అనేక దరఖాస్తులు వచ్చాయి. ఇలాంటి సందర్భాల్లో సర్వేయర్ల కొరత వల్ల సర్వేలో తీవ్ర జాప్యం అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అర్హత కలిగిన వారికి శిక్షణ ఇచ్చి, లైసెన్స్ జారీ చేయడం ద్వారా సర్వేయర్లుగా గుర్తింపు ఇవ్వబోతోంది. దీంతో సర్వే సమస్యలు త్వరగా పరిష్కారం కానున్నాయి.

నయనానందకరం.. అలంకార వైభవం


స్వామివారికి లక్ష పుష్పార్చన చేస్తున్న అర్చకులు


శ్రీరామ అలంకార సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరి క్షేత్రంలో జరుగుతున్న శ్రీలక్ష్మీ నరసింహుడి జయంతి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి అలంకార సేవలు కనువిందు చేస్తున్నాయి. భక్తులు అలంకార సేవలను కనులారా వీక్షించి తన్మయత్వం పొందుతున్నారు. రెండో రోజు శనివారం ఉదయం స్వామివారిని కాళీయమర్దని శ్రీకృష్ణుడిగా అలంకరించి అర్చకులు, వేద పండితుల వేదమంత్రాలు, భాజ భజంత్రీలతో ఆయల మాడ, తిరువీధుల్లో ఊరేగించారు. సాయంత్రం శ్రీరామావతారంలో హనుమంతవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమించ్చారు. ఇక పాతగుట్టలోనూ స్వామివారి జయంత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకములు, నవకలశ స్నపనం, లక్ష పుష్పార్చన జరిపించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఉత్సవాలు ఆదివారం పరిసమాప్తం కానున్నాయి.

ప్రభుత్వ బడిలోనే చేర్చండి

రామన్నపేట : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని రామన్నపేట మండలంలోని కొమ్మాయిగూడెం ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం మురళీధర్ కోరారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచేందుకు శనివారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తీర్మానించారు. సర్కారు స్కూళ్లలోనే అనుభవజ్ఞులైన, నిపుణులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రైవేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పి స్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సఫియాబేగం, కోట విజయవెంకన్న, మండడి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీని వాస చారి, గడ్డం శ్రీని వాస్ గ్రామపెద్దలు కూనూరు క్రిష్ణగౌడ్, ఎర్ర కాటమయ్య, బోయపల్లి మల్లేశం, ఎర్ర రవీందర్, నరేష్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వలస కూలీల వివరాలు సేకరణ


భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వసల కూలీల వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు


భువనగిరిలోని జగదేవ్‌పూర్ అడ్డా వద్ద వలస కూలీలకు సూచనలు చేస్తున్న సీఐ

భువనగిరిటౌన్ : వలస కూలీలపై పోలీస్‌శాఖ దృష్టి సారించింది. కూలీల చిరునామా, ఆధార్ కార్డులు, ఇతరత్రా వివరాలు సేకరించడంతో పాటు బయోమెట్రిక్ సైతం తీసుకుంటున్నారు. గతంలో నామమాత్రంగా ఉన్న ఇతర రాష్ట్రాల కూలీల వలసలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికమయ్యాయి. బిహార్, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, కోల్‌కత, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, మహారాష్ట్ర నుంచి వేలాది మంది కూలీలు జిల్లా కేంద్రంలో తిష్టవేశారు. ఐదారుగురు కూలీలు కలిసి గదులు అద్దెకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. కొందరు అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. కార్మికుల్లో అనేక మంది వ్యసనాలకు బానిసలుగా మారుతున్నట్లు తెలుస్తోంది. ఉదయం లేవగానే తంబాకు, గుట్కా, జర్దా, గంజాయి, మద్యం సేవించి కూలి పనికి వెళ్తున్నారు. పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాతో పాటు ఇతర అడ్డాల వద్దకు ఉదయం 6 గంటల నుంచే పెద్ద సంఖ్యలో కూలీలు చేరుకుంటారు. కూలీల్లో అధికంగా ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలే ఉంటారు. వీరిపై వివిధ రకాల ఫుకార్లు వస్తుండడంతో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ఐడీ కార్డులో కూలీల సమస్త సమాచారం
వలస కూలీల సర్వే పూర్తి కాగానే వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని భువనగిరి పట్టణ పోలీసులు భావిస్తున్నారు. నంబర్ కేటాయించడంతో పాటు కూలీల సమస్త సమాచారం కార్డులో పొందుపర్చనున్నారు. వలస కూలీలకు గది అద్దెకు ఇవ్వాలన్నా, పనిలో కుదరాలన్నా యజమానులు గుర్తింపు కార్డు పరిశీలించి ఇవ్వాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు నెల జీతం విరాళం

- ప్రకటించిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు.. తన నెల జీతాన్ని నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ఇస్తున్నట్లు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. మండలి వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో మిగతా సభ్యులు కూడా నెల జీతం డిఫెన్స్ ఫండ్‌కు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శనివారం నల్లగొండ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆవాసాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్ దాడులకు పాల్పడుతోందని, దాయాది దేశం యుద్ధనీతిని విస్మరించిందని అన్నారు. భారత జవాన్లు యుద్ధనీతిని పాటిస్తూ కేవలం ఉగ్రవాదుల శిబిరాలపైనే దాడి చేస్తున్నారని అన్నారు. భారత్ పాకిస్తాన్ మధ్య శాశ్వత పరిష్కారం కావాలంటే పీవోకేను భారత్ స్వాధీనం చేసుకోవాలన్నారు. యుద్ధ సమయంలో ప్రజలు దేశానికి మద్దతుగా ఉండాలన్నారు. వీర జవాన్ మురళీనాయక్‌కు ఆయన సంతాపం తెలిపారు. అందాల పోటీలనేవి ఒక భారతదేశానికి చెందినది కాదని, ప్రపంచ దేశాల నుంచి చాలా మంది వస్తున్నారని అన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ పార్థసారథి

చివ్వెంల(సూర్యాపేట): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం పోలీసుల అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి శనివారం చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చివ్వెంల మండలం బీబీగూడెం గ్రామ శివారులో శనివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను చూసి వారు పారిపోతుండగా.. వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా అందులో గంజాయి ఉంది. వారిని విచారించగా.. ఒరిస్సా రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేసి సూర్యాపేటలో అమ్మేందుకు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. పట్టుబడిన నిందితులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అమర్‌నాథ్ నిషార్, తమిళనాడుకు చెందిన మహ్మద్ హబీబ్‌గా పోలీసులు గుర్తించి వారిపై నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వీరి వద్ద నుంచి 1.250 కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు వి. మహేశ్వర్, కనకరత్నం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లీ.. నీకు వందనం





దేవుడు అన్ని చోట్ల ఉండలేక అమ్మను సృష్టించాడు అంటుంటారు. తమ బిడ్డలు ఎక్కడ ఉన్నా.. ఎలా ఉన్నా.. ఏ పరిస్థితుల్లో ఉన్నా అమ్మ ప్రేమ మాత్రం మారదు. నేడు మాతృదినోత్సవం సందర్భంగా అలాంటి

అమ్మ ప్రేమకు నిదర్శనంగా నిలిచిన కథనాలు..

కూలీ పనులు చేసి.. కుమారుడిని చదివించి



తల్లితో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎలిపెద్ది శ్రీధర్‌రెడ్డి

గుండాల: భర్త చనిపోవడంతో కూలీ పనులు చేస్తూ, చెవి కమ్మలు అమ్మి తన పెద్ద కుమారుడిని డిగ్రీ పూర్తిచేయించి ఆ తల్లి నమ్మకాన్ని వమ్ము చేయకుండా డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యాడు గుండాల మండలం మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఎలిపెద్ది శ్రీధర్ రెడ్డి. ఎలిపెద్ది రాంరెడ్డి, పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు ఎలిపెద్ది శ్రీధర్‌రెడ్డి 7వ తరగతిలో ఉన్నప్పుడే తండ్రి రాంరెడ్డి మరణించారు. అప్పటి నుంచి పద్మ వ్యవసాయంతో పాటు కూలీ పని చేస్తూ పిల్లలను చదివించింది. పెద్ద కుమారుడు శ్రీధర్‌రెడ్డి చిన్నప్పటి నుంచి చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి క్లాస్‌లో ముందుండేవాడు. శ్రీధర్‌రెడ్డికి ఇంటర్‌లో మంచి మార్కులు రావడంతో అతడిని డిగ్రీ చదివించేందుకు డబ్బులు లేక పద్మ ఇబ్బందులు పడింది. కొడుకు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తన చెవి కమ్మలను అమ్మి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చేర్పించింది. ప్రతిరోజు కూలీ పనులకు వెళ్లగా వచ్చిన డబ్బులతో కొడుకును డిగ్రీ పూర్తి చేయించింది. తల్లి కష్టాన్ని చూస్తూ పెరిగిన శ్రీధర్‌రెడ్డి ఉస్మానియా విశ్వ విద్యాలయం నిర్వహించిన పీజీ ఎంట్రెన్స్ పరీక్షలో స్టేట్ 2వ ర్యాంకు తెచ్చుకున్నాడు. ఎంఎస్సీ ఫిజిక్స్ పూర్తిచేసి, బెంగుళూరులోని ప్రతిష్టాత్మకమైన జాన్సర్ (జేఎన్‌సీఏఎస్ఆర్) విశ్వవిద్యాలయంలో 2013 వరకు పీహెచ్‌డీ విద్యను కొనసాగించారు. 2012లో ఏపీపీఎస్సీ నిర్వహించిన డిగ్రీ లెక్చరర్ పరీక్షల్లో స్టేట్ 2వ ర్యాంకు తెచ్చుకొని నారాయణఖేడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించి చిన్న వయస్సులోనే గెజిటెడ్ హోదా పొందారు. తన తల్లి కూలి పనిచేసి తనన చదివించిందని, ఆమె లేకుంటే తాను ఈరోజు ఈ స్థాయికి చేరుకునే వాడిని కాదని శ్రీధర్‌రెడ్డి చెబుతున్నారు.

37 ఏళ్లుగా కుమారుడికి సపర్యలు



కుమారుడు రమేశ్‌కు అన్నం తినిపిస్తున్న తల్లి భారతమ్మ

భూదాన్‌పోచంపల్లి: పుట్టుకతోనే మానసిక దివ్యాంగుడైన కుమారుడికి ఆ తల్లి 37 ఏళ్లగా అన్నీ తానై సపర్యలు చేస్తోంది. భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు యంబ భిక్షపతి, భారతమ్మ దంపతుల కుమారుడు యంబ రమేశ్ పుట్టుకతోనే మానసిక దివ్యాంగుడు. బాల్యం నుంచే నడవలేక మంచానికే పరిమితమయ్యాడు. దీంతో తల్లి భారతమ్మే కుమారుడికి అన్ని సపర్యలు చేస్తూ సాకుతోంది. మల, మూత్రవిసర్జన నుంచి స్నానం చేయించడం, భోజనం తినిపించడం ఆమె చేస్తోంది. కుమారుడిని ఒంటరిగా వదిలి శుభకార్యాలకు వెళ్లలేని పరిస్థితి ఆమెది. ఏడాది క్రితం భిక్షపతి కూడా అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో భారతమ్మే చిటికి కడుతూ, ఇటు కుమారుడికి వచ్చే పింఛన్‌తోనే జీవనాన్ని సాగిస్తోంది. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదు. 37 సంవత్సరాలుగా కుమారుడికి సేవలు చేస్తున్నా తనకు ఎప్పుడూ విసుగు అనిపించలేదని, అన్నింటికి ఓర్చుకుంటూ సంతోషంగా భరిస్తున్నానని భారతమ్మ పేర్కొంది. తన కుమారుడికి ఫిట్స్ వస్తుందని, మందులు కొనేందుకు కూడా డబ్బులు లేవని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటోంది.

వృద్ధాప్యంలోనూ కుమారుడికి సేవలు

నల్లగొండ టౌన్ : కండరాల క్షీణత వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైన కుమారుడికి గత 26 ఏళ్లుగా తల్లే అన్నీ తానై సపర్యలు చేస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. ఇప్పుడు ఆమె కూడా వృద్ధాప్యంలోకి రావడంతో తన కుమారుడి పరిస్థితి ఏమిటని కుమిలిపోతోంది. నల్లగొండ పట్టణంలోని 11వ వార్డు మారుతీనగర్‌కు చెందిన జంపాల గోపాల్ ఐటీఐ పూర్తిచేసి 2000 సంవత్సరంలో ఆర్టీసీలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఉద్యోగం రావడంతో ఫిజికల్ టెస్ట్‌లో భాగంగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి వైద్య పరీక్షల కోసం పంపించారు. అక్కడ గోపాల్‌కు కండరాల క్షీణత వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో అతడు ఉద్యోగం కోల్పోయాడు. ఆ తర్వాత ఆరు నెలల్లోనే వ్యాధి తీవ్రమై కండరాలు క్షీణించి జీవచ్ఛవంలా మారాడు. నడవలేక, కాళ్లు, చేతులు పనిచేయక మంచానికే పరిమితమయ్యాడు. అప్పటి నుంచి తల్లి అంజమ్మ అన్నీ తానై గోపాల్‌కు సపర్యలు చేస్తోంది. ప్రస్తుతం 70 ఏళ్ల వయస్సులోనూ తల్లి అంజమ్మ నడవలేని స్థితిలో కూడా కుమారుడికి సపర్యలు చేస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. కేవలం వృద్ధాప్య పెన్షన్‌తోనే పూట గడవక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తోంది. అచేతన స్థితిలో ఉన్న తనను ప్రభుత్వం ఆదుకోవాలని. లేదంటే డెత్ ఇంజెక్షన్ ఇచ్చి ఈ నరకం నుంచి విముక్తి కల్పించాలని బాధితుడు గోపాల్ వేడుకుంటున్నాడు.



కుమారుడు గోపాల్‌కు అన్నం తినిపిస్తున్న తల్లి అంజమ్మ

అమ్మ త్యాగమే నా విజయానికి పునాది

- పి. మౌనిక, ఏఎస్పీ, దేవరకొండ



తల్లితో దేవరకొండ ఏఎస్పీ మౌనిక

దేవరకొండ: అమ్మ మద్దతు, త్యాగమే తన విజయానికి పునాది అని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అంటున్నారు. తాను ఐపీఎస్ అధికారిగా ఉంటూ పేదలకు న్యాయం అందించగలుగుతున్నా అంటే అది తన తల్లి అమ్మ చలవే అని పేర్కొన్నారు. మదర్స్ డేను పురస్కరించుకొని తన తల్లి గురించి ఆమె మాటల్లోనే.. మా నాన్న రామ్‌కుమార్ రక్షణ శాఖకు చెందిన బీడీఎల్‌లో అదనపు డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. అమ్మ వాణికుమారి బిజినెస్ ఉమెన్. నిత్యం తాను బిజినెస్ పరంగా బిజీ లైఫ్ గడిపేది. అయినా మా కుటుంబానికి తన విలువైన సమయాన్ని కేటాయించేది. ఆమె మా కుటుంబానికి ఆర్థిక స్తంభంగా నిలిచింది. నేను యూపీఎస్సీ ప్రిపరేషన్ కొనసాగించేందుకు ఆమె నిరంతరం నన్ను ప్రేరేపించేది. ఎప్పుడూ కుంగుబాటుకు లోనుకాకుండా నన్ను వెన్నంటి ప్రోత్సహించేది. ఓ వైపు గృహిణిగా, మరో వైపు బిజినెస్ ఉమెన్‌గా ఉంటూనే మా బాగోగులు చూసేది. అమ్మ నాపై ఉంచిన నమ్మకం నాకు బలాన్ని ఇచ్చింది. ఆమె నాపై చూపించిన ప్రేమ ఎన్నో సవాళ్లను అధిగమించడానికి సహాయపడింది. అమ్మ ప్రేమ ఎప్పటికీ వెలకట్ట లేనిది.

తల్లి కిడ్నీ దానం.. కుమారుడికి కొత్త జీవితం



తల్లి లక్ష్మితో గిరిబాబు

మిర్యాలగూడ: చిన్న వయస్సులోనే కుమారుడి కిడ్నీలు చెడిపోవడంతో తన కిడ్నీ దానం చేసి కొడుకుకు కొత్త జీవితాన్ని ప్రసాదించింది వేములపల్లి మండలం మొల్కపట్నంకు చెందిన జెర్రిపోతుల లక్ష్మి. జెర్రిపోతు వెంకటయ్య, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు గిరిబాబు సంతానం. కుమార్తెలు, కుమారుడి వివాహం చేసి తమకున్న భూమిలో వ్యవసాయంతో పాటు గీత కార్మిక వృత్తి చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. గిరిబాబుకు 2018లో 25 ఏళ్ల వయస్సులో మూత్రపిండాల్లో సమస్య వచ్చింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించి మందులు వాడాడు. 2021 జూన్‌లో గిరిబాబుకు కరోనా సోకడంతో సమస్య తీవ్రమైంది. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటూ చికిత్స పొందాడు. దాదాపు రూ.10లక్షల వరకు ఖర్చు చేసి తల్లిదండ్రులు గిరిబాబుకు వైద్యం చేయించారు. గిరిబాబుకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తే ఆరోగ్యంపై భరోసా ఇస్తామని డాక్టర్లు చెప్పారు. ఎలాగైనా కొడుకును కాపాడుకోవాలని తన కిడ్నీ ఇచ్చేందుకు అతడి తల్లి ముందుకు వచ్చింది. అప్పు చేసి రూ.15లక్షలు సిద్ధం చేసుకొని 2022 జూలై 12న గిరిబాబుకు లక్ష్మి కిడ్నీని అమర్చారు. ఒక్కగానొక్క కుమారుడికి ఆరోగ్యం బాలేక అవస్థలు పడుతుంటే సూడలేక పోయేదాన్నని, తన కొడుకు ప్రాణం కంటే తన ప్రాణం ముఖ్యం కాదని కిడ్నీ ఇచ్చానని లక్ష్మి చెబుతోంది. తన తల్లి కిడ్నీ దానం చేసి తనకు పునఃజన్మ ఇచ్చిందని, ఆమె రుణం ఏమిచ్చినా తీర్చుకోలేనని గిరిబాబు పేర్కొన్నాడు.

ఇద్దరు కుమారులను సైన్యంలోకి పంపి..



తల్లిదండ్రులు సోమయ్య, మల్లమ్మ



రమేష్, మత్స్యగిరి

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన జినుకల సోమయ్య, మల్లమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. వీరు కూలీ పనులు చేస్తూ తమ కుమారులను చదివించారు. పెద్ద కుమారుడు జినుకల రమేష్ సైన్యంలో చేరి 23 సంవత్సరాలుగా దేశానికి సేవలు అందిస్తున్నారు. వివిధ రాష్ట్రాల్లో పనిచేసి ప్రస్తుతం జమ్మూ, ఉదయ్‌పూర్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. రమేష్‌కు భార్య శ్రీలత, కుమార్తె, ఇద్దరు కుమారులు సంతానం. అన్న చూపిన దారిలోనే తమ్ముడు జినుకల మత్స్యగిరిని సైతం తల్లిదండ్రులు సైన్యంలోకి పంపారు. మత్స్యగిరి కూడా సుమారు 11 సంవత్సరాలుగా సైన్యంలో పని చేస్తున్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ సైనిక కేంద్రంలో జవాన్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య మౌనిక, కుమార్తె ఉన్నారు. తమ కుమారులు దేశ సేవ చేస్తున్నందుకు తనకు ఎంతో గర్వ కారణంగా ఉందని వారి మాతృమూర్తి మల్లమ్మ గర్వంగా చెబుతోంది. దేశ సేవే తమ కుటుంబానికి బతుకునిస్తుందని ఆమె అన్నారు. పాకిస్తాన్, భారత్ యుద్ధంతో ఓ పక్క భయమేస్తున్నప్పటికీ, మరో పక్క యుద్ధంలో సైనికులుగా తన కుమారులు ఉండటం తనకెంతో గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. ఇద్దరు కుమారులను దేశ సేవకే అంకితం చేయడంతో పలువురు ఆమెను అభినందిస్తున్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

మిర్యాలగూడ: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామ శివారులో జరిగింది. వాడపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని బోట్యానాయక్‌తండాకు చెందిన బానోతు హనుమంతు(45) శనివారం పని నిమిత్తం దామరచర్ల మండలంలోని కల్లేపల్లి గ్రామానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. కొండ్రపోల్ గ్రామ శివారులో అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో హనుమంతు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఐసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

నల్లగొండ టూటౌన్: ఐసెట్- 2025 పరీక్షకు ఎటువంటి ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఐసెట్ కన్వీనర్, మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అలువాల రవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పగటి పూట చోరీలు.. దొంగ అరెస్ట్

- 22 తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుని పగటి పూట చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 22 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండలో గత 3 నెలలుగా పది చోట్ల పగటి పూట దొంగతనాలు జరిగాయన్నారు. దొంగలను పట్టుకునేందుకు డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో వన్ టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం నల్లగొండ మున్సిపాలిటీ పరిదిలోని పాతబస్తీలో బంగారు దుకాణాల వద్ద ఓ వ్యక్తి అనుమానస్పదంగా బంగారు ఆభరణాలు అమ్మడానికి రావడంతో నమ్మదగిన సమాచారం మేరకు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది అతడిని పట్టుకుని విచారించారు. పట్టుబడిన వ్యక్తి నల్లగొండ మండలం కొత్తపల్లికి చెందిన పాలడుగు నరేష్‌గా పోలీసులు గుర్తించారు. నరేష్ చిన్నతనం నుంచే దొంగతనాలు చేయడానికి అలవాటుపడి, మద్యానికి, ఇతర వ్యసనాలకు బానిసైనట్లు ఎస్పీ తెలిపారు. అతడిపై గతంలో 4 కేసులు నమోదు కాగా.. జైలుకు కూడా వెళ్లాడని పేర్కొన్నారు. అయినప్పటికీ చోరీలు చేయడం మానుకోలేదు. జనవరి నుంచి ఏప్రిల్ వరకు నల్లగొండలో మొత్తం 10 ఇళ్లలో చొరబడి చేతులకు గ్లౌజులు తొడుక్కోని బీరువా పగులగొట్టి ఆభరణాలు చోరీ చేసేవాడని ఎస్పీ తెలిపారు. ఆ ఆభరణాలను అమ్మగా వచ్చిన డబ్బును జల్సాలకు ఖర్చు చేసేవాడు. అతడిపై నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 8, టూటౌన్ పరిధిలో 1, రూరల్ పరిధిలో 1 కేసు నమోదు కాగా.. అతని నుంచి 22 తులాల బంగారం, 2 కటింగ్ మిషన్లు. ఇతర వస్తువులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకున్న పోలీస్ బృందాలను ఎస్పీ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐలు సైదులు, సందీప్, గోపాల్‌రావు, వెంకన్న, వెంకటనారాయణ, రబ్బాని, లింగారెడ్డి, షకీల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మట్టపల్లిలో తిరుకల్యాణోత్సవాలు ప్రారంభం



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో తిరుకల్యాణోత్సవాలను శనివారం రాత్రి ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, మృత్యంగ్రహణం, అంకురారోపణం, ధ్వజారోహణం, నవకుంభారోపణం, అగ్నిప్రతిష్ఠాపనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్ ఈఓ నవీన్ కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన అధ్యయనోత్సవాలు..

మట్టపల్లి క్షేత్రంలో కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు శనివారం చివరిరోజు శాత్తుమరై ఉత్సవంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, పారాయణాలు కొనసాగాయి. అనంతరం మహా నివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, చివలూరి పద్మనాభాచార్యులు, కుమ్మరికుంట్ల బదరీనారాయణాచార్యులు, మార్తి లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు, నరసింహాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శనివారం పోలీసులు గుర్తించారు. శనివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో పట్టణంలోని బుడిగె జంగాల కాలనీ వెనుక చెట్ల పొదల్లో 50ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించగా.. మృతదేహం కుళ్లిపోయి ఉందని, ఎలాంటి ఆధారాలు లభించలేదని పట్టణ సీఐ భాస్కర్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

చింతపల్లి: చింతపల్లి మండలం వింజమూరు గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వింజమూరు గ్రామానికి చెందిన కంటెల శ్రీను, కంటెల భిక్షమయ్య బైక్‌పై చింతపల్లి మండల కేంద్రానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. గ్రామ శివారులో మూలమలుపు వద్ద వీరి బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం వారిని మాల్ వెంకటేశ్వర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

విధుల నుంచి వీఓఏ తొలగింపు

- అధికార పార్టీ నాయకులు వేధిస్తున్నారని నోట్ రాసి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వీఓఏ
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మండల వీఓఏలు



సంధ్య, వీఓఏ

యాదగిరిగుట్ట రూరల్: గ్రామంలో పనిచేస్తున్న వీఓఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)ను విధుల నుంచి తొలగించడంతో మనస్తాపం చెంది ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో శనివారం జరిగింది. మండల వీఓఏలు తెలిపిన వివరాలు ప్రకారం.. కాచారం వీఓఏ మిట్ట సంధ్యను ఎలాంటి కారణం లేకుండా పై అధికారులు విధుల నుంచి అన్యాయంగా తొలగించారన్నారు. దీంతో మనస్తాపంతో సంధ్య శనివారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయిందన్నారు. ఈ మేరకు యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మండల వీఓఏలు తెలిపారు.

అధికార పార్టీ నాయకులు వేధిస్తున్నారని నోట్ రాసి..

గత కొన్ని రోజులుగా కాచారం గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు కొందరు తనను వేధిస్తున్నారని వీఓఏ సంధ్య ఓ నోట్ రాసి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. తనను అవమానపర్చడంతో పాటు తరచూ దూషిస్తూ, ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆ నోట్‌లో రాసి ఉంది. గ్రామంలో ఇంటింటికి వెళ్లి మహిళా సంఘాల సభ్యుల సంతకాలు సేకరించి, సంతకాలు పెట్టని వారికి ఇందిరమ్మ ఇళ్లు రావని బెదిరించి, మహిళలందరినీ అధికారుల వద్దకు తీసుకెళ్లి తనకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తనను ఉద్యోగాలో నుంచి తీసివేయించారని సంధ్య నోట్‌లో రాసి వెళ్లిపోయింది.

ఆమె ఉద్యోగం ఆమెకే ఉంటుంది

మండల వీఓఏలు అందరూ కలిసి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను కలిసి ఈ విషయం చెప్పారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. సంధ్య ఉద్యోగం ఆమెకే ఉంటుందని చెప్పారు. సంధ్య ఆచూకీ కనిపెట్టాలని స్థానిక పోలీసులు ఆదేశించారు. అకారణంగా ఉద్యోగం నుంచి తీసివేసిన వారిపై తగిన చర్యలు ఉంటాయన్నారు. ఈ మేరకు మిస్సింగ్ కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్ తెలిపారు.

విద్యుద్దీపాల అలంకరణలో బుద్ధవనం



హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు సోమవారం నాగార్జునసాగర్‌కు వస్తుండటంతో అధికారులు బుద్ధవనాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. బుద్ధవనం నుంచి విజయ విహార్ అతిథి గృహం వరకు ప్రధాన రహదారి వెంట విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. బుద్ధవనంలోని అన్ని ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రతి ఏడాది బుద్ధవనంలో బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది బుద్ధ జయంతికి సుందరీమణులు హాజరవుతుండటంతో ప్రత్యేకతను సంతరించుకుంది.

\- నాగార్జునసాగర్

జవాన్ల కుటుంబ సభ్యుల పాదాలకు పుష్పాభిషేకం



త్రిపురారం మండల కేంద్రంలో శనివారం జవాన్ల కుటుంబ సభ్యుల పాదాలకు గ్రామస్తులు పుష్పాభిషేకం చేశారు. అనంతరం శాలువాలు కప్పి సన్మానించారు. భారత్, పాకిస్తాన్ దేశాల మధ్యన ఉద్రిక్తల నేపథ్యంలో జవాన్ల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, గ్రామం మొత్తం వారికి బాసటగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

\- త్రిపురారం